జిన్నర్ల విముఖత

రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా పత్తి సాగులో మొదటి స్థానంలో ఉంది. ఇప్పటికే బోరు బావులు కింద, ముందస్తు వర్షాలకు పత్తిని మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకి దిగజారుతున్నాయి. పత్తి ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.7500 మించి రైతులకు అందడం లేదు. అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ఈపడాది ముందుగానే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని రంగంలోకి దించి కనీస మద్దతు ధరతో రైతుల ను ఆదుకోవాలని చూస్తోంది. సీసీఐ విధించిన నిబంధనలు సడిలిస్తే తప్ప తాము జిన్నింగ్ పరిశ్రమలు అద్దెకు ఇవ్వలేమని చెబుతున్నారు.



ఆదోని పత్తి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమ

- కొర్రీలు విధించిన సీసీఐ
- పత్తి కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటుపై ప్రతిష్టంభన
- రోజురోజుకి పతనమవుతున్న ధరలు
- ఆందోళనలో అన్నదాతలు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి అద్దెకిచ్చేందుకు పత్తి జిన్నింగ్ పరిశ్రమలు విముఖత చూపుతున్నాయి. ఇప్పటికే మూడుసార్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జిన్నింగ్ పరిశ్రమలకు టెండర్లను ఆహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరు కూడా టెండర్లు దాఖలు చేయలేదు. ఈనెల 27వ తేదీ వరకు టెండర్లను పొడిగించింది. రాష్ట్రప్రభుత్వం ఓవైపు సీసీఐ ఉన్నతాధికారులతో నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని ప్రయత్నాలు చేస్తుంది. నిబంధనలు సడలిస్తే తప్ప తాము టెండర్లలో పాల్గొనమని పత్తి పరిశ్రమల యజమానులు కరాఖండిగా చెబుతున్నారు.



పరిశ్రమలో ఉత్పత్తి అయిన దూది బేళ్ళు



రూ.7500కు మించి కొనుగోలు..

ఉమ్మడి కర్నూలు జిల్లా పత్తి సాగులో మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.45లక్షల హెక్టార్లకు పైగా రైతులు పత్తి సాగుచేశారు. 38-45లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే బోరు బావులు కింద, ముందస్తు వర్షాలకు పత్తి మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకి దిగజారు తున్నాయి.

మిగతా 5వ పేజీలో

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ ఏ.సిరి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దరఖాస్తుల స్టేటస్‌ను తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

పీఎం, సీఎం పర్యటనపై నేడు టీడీపీ సమావేశం


- హాజరు కానున్న మంత్రులు



మాట్లాడుతున్న పాలకుర్తి తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 16న దేశప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ పర్యటనపై కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు, బీజేపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు, ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ప్రధాని పర్యటనను జయప్రదం చేసే విషయంపై చర్చించి ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.

రేపు వాల్మీకి జయంతి



కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని 7వ తేదీన మంగళవారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ప్రసూన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంలోని గౌరిగోపాల్ హాస్పిటల్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. జిల్లాలోని బోయ, వాల్మీకులు, వివిధ కుల సంఘాల నాయకులు మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీగిరిపై భక్తజన సందోహం




భక్తుల రద్దీతో క్యూలైన్లు

శ్రీశైలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దసరా సెలవులతో పాటు వారాంతం కావడంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు వేలసంఖ్యలో శ్రీగిరికి చేరుకున్నారు. దీంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లు నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకున్న అధికారులు ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు నిలుపుదల చేశారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, దర్శనాల ద్వారా భక్తులు మల్లికార్జునస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో ముందుగా దరఖాస్తు చేస్తున్న వారికి మాత్రమే వీఐపీ బ్రేక్, స్పర్శ దర్శనాలను కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సాఫీగా ఏపీపీ పరీక్ష

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 42అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పోస్టులకు జరిగిన రాత పరీక్ష సాఫీగా ముగిసింది. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,494మంది అభ్యర్థులు హాజరైనట్టు రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు విడుదల చేస్తామని చెప్పారు. అభ్యంతరాలున్నవారు ఈ నెల 8లోగా ఎస్ఎల్‌పీఆర్‌బీకి మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. అర్హత మార్కులు సాధించిన వారికి త్వరలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

నిండుకుండలా జీడీపీ



గాజులదిన్నె ప్రాజెక్టులో వరద నీరు

- పంట సాగుకు ఆయకట్టు రైతుల సమాయత్తం

గోనెగండ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, డోన్, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల రైతుల జీవనాడి గాజులదిన్నె ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. 20 రోజులుగా జీడీపీలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. గత నెల 12వ తేది నుంచి ఇప్పటి వరకు వరకు జీడీపీ ఇరిగేషన్ అధికారులు దాదాపు 20 సార్లు గేట్లు ఎత్తి నీటిని హంద్రీకి వదిలారు. ప్రాజెక్టు సామర్థ్యం 4.5 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 4.1 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. హంద్రీనీవా నుంచి రోజుకు 120 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఎల్లెల్సీ నుంచి 60 క్యూసెక్కుల నీరు జీడీపీకి వస్తోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, రాతన, తదితర ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరింది. ప్రాజెక్టులో పుష్కలంగా నీటి లభ్యత ఉండటంతో తాగునీటి పథకాలకు నీటి ఇబ్బందులు తీరినట్లయింది. బండగట్టు, డోన్, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు, అవసరమైనప్పుడు కర్నూలు, కోడుమూడు, గూడురు, బెళగల్ ప్రాంతాలకు కూడా తాగునీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

జీడీపీ ఆయకట్టు రైతుల ఆనందం

ప్రాజెక్టు కింద 24,500 ఎకరాలు రబీలో సాగయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో రబీకి నీటి కష్టాలు ఉండవని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టులో గత మూడేళ్ల తరువాత ఈ ఏడాది నిండుకుండలా నీరు చేరింది. ఈ నెల పదోతేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుండటంతో జీడీపీ కింద ఉన్న గాజులదిన్నె, పుట్టపాశం, హెచ్‌కైరవాడి, వేముగోడు, తిప్పనూరు, బోదేపాడు, కోడుమూరు, డోన్, పత్తికొండ ప్రాంతాలకు చెందిన ఆయకట్టు రైతులు రబీలో పంట సాగు కోసం భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్ సాగు చేసిన పంటను తొలగించి దుక్కి విత్తనాలకు సిద్ధమవుతున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జల క్రీడలు

5

దేశ సమైక్యతే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లా విభాగ్ ప్రచారక్ సురేంద్ర

దేవరగట్టుపై శివనాదం

- ఆకట్టుకున్నగొరవయ్యల నృత్యం
- 4వ ప్రయత్నంలో తెగిన ఇనుప గొలుసు
- నేటితో బన్ని ఉత్సవాల ముగింపు



దేవరగట్టులో ఇనుప గొలుసు తెంపుతున్న గొరవయ్య గాదిలింగ



హొళగుంద, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. దేవరగట్టుపై శివనాదం మార్మోగింది. శుక్రవారం దేవరగట్టులో జరిగిన గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టంగా భావించే గొలుసు తెంపే ఉత్సవాన్ని చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అర్చకులు నిర్ణయించిన సమయం ఉదయం 9 గంటలకు బల్లూరుకు చెందిన గొరవయ్య గాదిలింగ ఇనుప గొలుసును 4వ ప్రయత్నంలో తెంపి ఔరా అనిపించారు. దేవరగట్టు పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం దేవదాసీల క్రీడలు సైతం ఆకర్షణీయంగా సాగాయి. బన్ని ఉత్సవాల్లో సోమవారం చివరి ఘట్టమైన వసంతోత్సవంలో భక్తులపై గొరవయ్యలు రంగులను చల్లి ఘనంగా కంకణ విసర్జన చేపడతారు. దీంతో బన్ని ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, హొళగుంద, హాలహర్వి, తుగ్గలి ఎస్ఐలు గురజాల దిలీప్ కుమార్, మారుతి, బాలనరసింహులు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోస్ట్ మల్లికార్జున, కురువ సోమప్ప, వీర నాగప్ప, రాజశేఖర్, వైసీసీ నాయకులు ఎస్‌కే గిరి, రామునాయక్ పాల్గొన్నారు.



భైరవ అవతారంలో పంచామృతం తాగుతున్న గొరవయ్యలు



దేవర గట్టులో నృత్యం చేస్తున్న గుఱ్ఱప్పు మొకం వారు

టమోటా కిలో రూ.4



మార్కెట్ యార్డ్‌కు వచ్చిన టమోటా

పత్తికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్ యార్డులో టమోటా ధరలు కిలో రూ.4కు పడిపోయాయి. దీంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. 10 కిలోల జత గంపలు రూ.80 నుంచి రూ.100, 25 కిలోల జత గంపలు రూ.180 నుంచి 220 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. దసరా పండుగ సందర్భంగా 1,2 తేదీల్లో మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. దీంతో రెండురోజులు పొలంలో కోతకు సిద్ధంగా ఉన్నపంటను రైతులు కోతకోసి మార్కెట్ తీసుకొచ్చారు. శనివారం మార్కెట్‌కు 5.5 టన్నులు దాటి అమ్మకానికి రావడంతో వ్యాపారులు తక్కువధరకు కొనుగోలు చేసినా రైతులు కూడా పట్టించుకోలేదు. అయితే ఆదివారం కూడా వ్యాపారులు తక్కువ ధరకే పంటను కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహించి టమోటాను కింద పారబోసి ఆందోళనకు దిగారు.

ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తాం - కార్నలీస్, కార్యదర్శి

దిగుబడులు అధికంగా రావడం, డిమాండ్ లేకపోవ డంతో పాటు గ్రేడింగ్ లేని టమోటాను మార్కెట్‌కు తీసుకురావడంతో ధరలు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ యార్డు ఎప్పుడు సిద్ధంగా ఉంటుంది. ఆదివారం సుమారు 6.5 టన్నుల టమోటా రైతుల నుంచి కిలో రూ.6 చెల్లించి కొనుగోలు చేశాం. రైతులకు గ్రేడింగ్‌చేసిన పంటను మార్కెట్‌కు తెస్తే గిట్టుబాటు ధరను ఖచ్చితంగా అందిస్తాం. రైతులు కూడా తమకు సహకరించాలి.

జత గంపలు రూ.220 కొన్నారు



25 కిలోల గంపలు పదింటిని మార్కెట్‌కు తెచ్చాను. జతగంపలు రూ.220కి వ్యాపారులు కొనుగోలు చేశారు. గంపకు రూ.20 చొప్పున ఆటోకు 200, వ్యాపారులు 10 శాతం కమీషన్ పోను రూ.825 చేతికి వచ్చాయి. కోతకూలీలు కూడా గిట్టుబాటుకాకపోతే పంటను మార్కెట్‌కు ఎందుకు తీసుకురావాలి.- **శివమ్మ దూదే కొండ**

పత్తికొండ మార్కెట్‌లో పడిపోయిన ధరలు

జత గంపలు రూ.80కి కొన్నారు



10 కిలోల గంపలు మార్కెట్‌కు 20 తీసుకొచ్చాను. రూ.80తో జత గంపలు వ్యాపారులు కొన్నారు. 10 శాతం కమీషన్, ఆటోబాడుగలు పోను రూ.520 మిగిలింది. కోతకూలీలు చెల్లిస్తే రూ.100 నాకే ఎదురు ఖర్చు అవుతుంది.

\- శ్రీరంగడు, కోతిరాళ్ల

వ్యాపారులు చెప్పిందే ధర



పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ధర. అదేం అని అడగలేం. అడిగినా పట్టించుకునే వారు ఉండరు. పది కిలోల గంపలు 20 తీసుకొచ్చాను. జత గంపలు రూ.80కి కొన్నారు. పచ్చి సరుకు వెనక్కు తీసుకుపోలేం. నష్టమో, లాభమో వచ్చినకాడికి అమ్ముకునేందుకు అలవాటుపడ్డాం.

\- కొండన్న, పుచ్చకాయలమడ

శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేత



మూసివేసిన గేట్లు

శ్రీశైలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఆదివారం డ్యాం అధికారులు గేట్లను మూసివేశారు. శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884 అడుగులుగా నమోదైంది. అదేవిధంగా 215 టీఎంసీల సామర్థ్యం ఉన్న డ్యాంలో ప్రస్తుతం 210 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాలైన జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 1,45,300 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 61,853 క్యూసెక్కుల నీటిని డ్యాం అధికారులు విడుదల చేశారు.

నేడు ప్రజా పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. సమీపంలోని సచివాలయంలో సైతం అర్జీలు ఇవ్వవచ్చన్నారు.

50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, ఐక్యవేదిక అధ్యక్షుడు శేషఫణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో జేఏసీ కన్వీనర్ దేవపూజ ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇతర కులాలను బీసీల్లో చేర్చిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. లక్ష్మీకాంతయ్య, అయ్యన్న యాదవ్, హేమంత్ గౌడు, విజయభాస్కర్ యాదవ్, షఫీవుల్లా పాల్గొన్నారు.

నేడు సర్దార్ నాగప్ప పుస్తకావిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ నాగప్ప జీవితంపై రాసిన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకుడు నక్కల మిట్ట శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం బీసీ భవన్ లో కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేవీ కృష్ణయ్య, దాసరి రామశేషయ్య, పెరికల రంగస్వామి, సివి వర్మ, దామోదరం రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి జయంతి

గూడూరు అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని 7వ తేదిన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం గూడూరులో వాల్మీకి ఆలయం వద్ద వేడుకలను ప్రారంభించారు. మంగళవారం వాల్మీకి ఆలయంలో పూజ. సాయంత్రం ఊరేగింపు ఉంటుందన్నారు. పి. బాబు, గిడ్డయ్య, కేశవులు, మద్దిలేటి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న వాల్మీకులు

అభివృద్ధికి దూరంగా..

- తాగునీరు లేదు, రోడ్డు లేదు.. గ్యాస్ సిలిండర్ కూడా రాదు..
- పందిపాడు ఇందిరమ్మ కాలనీవాసుల అవస్థలు



నగరపాలక పరిధిలోని 35వ వార్డు పందిపాడు ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి దూరంగా ఉంది. 2009లో కాలనీ ఏర్పడినా ఇంతవరకు కనీసం రోడ్డు కూడా వేయలేదు, తాగునీటి సౌకర్యం లేదు. దీంతో కాలనీ వాసులు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు.

కల్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పందిపాడు గ్రామంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసింది. రూ.2,100, రూ.4వేలు డీడీలు చెల్లించిన లబ్ధిదారులు 2,500 మందికి స్థలాలు కేటాయించారు.

తాగునీరు లేదు, గ్యాస్ సిలిండర్ రాదు..

కాలనీకి తాగునీటి పైప్‌లైన్ లేదు. దీంతో దాదాపు 3 కి.మీ.ల దూరంలోని ముజఫర్‌నగర్‌కు వెళ్లి మినరల్ వాటర్ తెచ్చుకోవలసి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీలో రోడ్డు లేకపోవడంతో గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ కూడా లేదు. ఏజెన్సీ నిర్వాహకులు ఎక్కడో సిలిండర్లను దించేసి సమాచారమిస్తున్నారు. దాంతో వినియోగదారులు అక్కడికి వెళ్లి అవస్థలు పడుతూ తెచ్చుకోవలసి వస్తోంది.

పలుమార్లు వినతులు..

కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా పరిష్కారం కాలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అందని ప్రభుత్వ ప్రోత్సాహం

కాలనీలో ఇళ్లు నిర్మించుకోడానికి నాటి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో చాలామంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకో లేకపోయారు. కాగా కొందరు 70మంది లబ్ధిదారులు అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని నివాసముంటున్నారు. మరో మరో 70 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. మిగతా వారు ఎవరూ ఇంటినిర్మాణానికి ముందుకు రావడం లేదు.

సీసీ రోడ్లు లేక ఇబ్బంది

కాలనీలోకి చేరుకునే ప్రధాన రహదారి బురదమయంగా మారింది. నల్లరేగడి నేల కావడంతో చిన్న వర్షం కురిసినా వాహనాలు వెళ్లేది అటుంచి కనీసం నడిచేందుకు కూడా వీలు కావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉన్నా, వీధి దీపాల్లో కొన్నే వెలుగుతున్నాయని అంటున్నారు.

అధికారులు స్పందించాలి



కానీలోని సమస్యలను అధికారులు పరిష్కరించాలి. రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చిన ప్రతిసారి నగరంలోకి రావాలంటే నరకం చూస్తున్నాం.
- శారద, కాలనీవాసి

గ్యాస్ సిలిండర్ కూడా రాదు..



కాలనీలో సీసీ రహదారి లేకపోవడంతో గ్యాస్ సిలిండర్ కూడా రావడం లేదు. ఇక అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చే అవకాశం లేదు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్నా ఇబ్బందులు తప్పడం లేదు. **- పద్మ, కాలనీవాసి**

జీఎస్టీ సంస్కరణలతో ఇంటి ఖర్చులు ఆదా



అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కల్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ఇంటి ఖర్చులు ఆదా అవుతున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి తెలిపారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధలోని సోనో-విజన్-షోరూంను ఎమ్మెల్యే సందర్శించి అక్కడ ఉన్న వినియోగదారులకు అవగాహన కల్పించారు. టీడీపీ ప్రజా సంక్షేమం కోసం అన్నివర్గాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ముందడుగు వేసిందన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్‌కె.శ్రీనివాసరెడ్డి, పియూ. మాదన్న, వి.జనార్ధన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



కర్నూలు-2 డిపో వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

కర్నూలు రూరల్ అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కర్నూలు-2 డిపో డ్రైవర్లు, కండక్టర్ల పట్ల ఏడీసీలు దురుసుగా వ్యవహరిస్తున్నట్లు ఆర్టీసీ ఈయూ డిపో కార్యదర్శి జి.మహేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డ్యూటీల విషయంలో చార్ట్‌వద్ద యూనియన్ పట్ల పక్షపాత వైఖరి చూపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కర్నూలు-గూడూరు రోడ్డు సరిగా లేక విధులు పూర్తి కావడానికి రాత్రి 12గంటలు అవుతోందని, డబుల్ డ్యూటీలు చేస్తేనే సెలవు ఇస్తామనే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమలేష్, రాముడు, గోపాల్, ఫక్రుద్దీన్, కృష్ణయ్య, పిజెరెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలం ట్రస్ట్‌బోర్డ్ డైరెక్టర్‌గా శివమ్మ



ఎమ్మెల్యే గౌరు దంపతులతో పీయూ మాదన్న, శివమ్మ

కల్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం 26 సంవత్సరాలు చేసిన సేవలను అధిష్టానం గుర్తించిందని ఆ పార్టీ జిల్లా కోశాధికారి, 10వ క్లస్టర్ ఇన్‌చార్జ్ పియూ.మాదన్న అన్నారు. మాదన్న సతీమణి పియూ శివమ్మను శ్రీశైలం ట్రస్ట్‌బోర్డ్ డైరెక్టర్‌గా ఎంపిక చేయడంతో ఆదివారం క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి దంపతులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మాదన్న మాట్లాడుతూ గౌరుచరితారెడ్డి గెలుపునకు పనిచేశానన్నారు. 2019-20 కర్నూలు కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే కాటసానికి ఎదురొడ్డి టీడీపీ కోసం పనిచేశానని తెలిపారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొ.వెంకట బసవరావు, ప్రొ.వెంకట బసవరావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్‌తో సహా ఇతర సంస్థల ఆధ్వర్యంలో డా.రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన 42 మందికి పురస్కారాలు అందజేశారు. పారిశ్రామికవేత్త టీజీ శివప్రసాద్ వైద్యుడు డా.శంకర్‌శర్మ డీఎస్పీ మహబూబ్ బాషా, డా.హరికిషన్, లక్ష్మీనారాయణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, రాయపాటి నాగలక్ష్మి, యలమర్తి రమణయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్మించేదెప్పుడు?

కోడుమూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్లలో అంగన్‌వాడీ కేంద్రం-3 భవన నిర్మాణం ఆగిపోయింది. తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభించి, అనంతరం వదిలేయడంతో పునాదులు, పిల్లర్లు శిథిలావస్థకు చేరాయి. సొంతభవనం లేకపోవడంతో రూ. 1,500లు చెల్లించి అద్దె గదిలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. -



అమడగుంట్లలో పూర్తికాని భవనం

విజయవంతం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 7వ తేదీన ఫ్యాప్టో నిర్వహించనున్న ఛలో విజయవాడను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ పీఆర్‌సీని అమలు చేస్తామని, రూ.30 కోట్ల బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా నెరవేర్చలేదన్నారు. టికే జనార్దన్, హెచ్.తిమ్మన్న, నాగేంద్ర, నాగరాజు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ కాకే ప్రకాష్‌రావు పిలుపునిచ్చారు. ఫ్యాప్టో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లా చైర్మన్ సేవాలాల్ నాయక్, నవీన్ పాటిల్, ఇస్మాయిల్, మరియానందం, ఎస్‌జీఎఫ్ రంగన్న ఉన్నారు.

నేడు కర్నూలుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం కర్నూలు నగరానికి రానున్నారు. ఆ పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి ప్రమాణ స్వీకరోత్సవంలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు మౌర్యఇన్ హోటల్ నుంచి ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న బీఎస్ ఫంక్షన్ హాలు వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆదోని ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారధి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ తదితరులు హాజరు కానున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

డాక్టర్ స్వరూప్ సిన్హాకు పురస్కారం

కర్నూలు రూరల్ అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకుడు డాక్టర్ స్వరూప్ సిన్హాకు జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. ఆదివారం కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాల యంలో లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌యూ వీసీ డా.బసవరాజు, డాక్టర్ శంకరశర్మ, చంద్రశేఖర్ కల్కూర, రాయపాటి శ్రీనివాస్ డీఎస్పీ మహబూబ్ బాషా పురస్కారాన్ని స్వరూప్ సిన్హాకు అందజేశారు. వీటితో పాటు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, బెస్ట్ లాంగ్వేజ్ ఫెసిలిటేటర్ పురస్కారాలను కూడా స్వరూప్ సిన్హా అందుకున్నారు.

ముగిసిన ల్యాక్రోస్ చాంపియన్‌షిప్

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శ కళాశాల మైదానంలో నిర్వహించిన ల్యాక్రోస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ క్రీడ 11వ శతాబ్దంలో అమెరికా దేశస్తులు ఆడేవారని గుర్తు చేశారు. ల్యాక్రోస్ క్రీడ భారతదేశంలోకి నూతనంగా వచ్చిందన్నారు. డీఎస్పీ మహబూబ్ బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.



ట్రోఫీ ప్రదానం చేస్తున్న డా.శంకర్‌శర్మ

ఉపాధ్యాయులకు సన్మానం



సత్కారం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి కత్వ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా కత్వ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పెద్ద స్వామి, రాజశేఖర్, బుర్ర చంద్రమోహన్ తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సమాజానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారిందన్నారు. యువత పెడదోవ పట్టకుండా సన్మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులు మాత్రమే అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన డాక్టర్ ఎం.హరికిషణ్, పి.మనోరమ, మల్లికార్జున, డాక్టర్ సింగంశెట్టి, సోమశేఖర్, డాక్టర్ విష్ణు వందన, జి.మురళి, రంగమ్మ, ఆత్మకూరు శివరాం, యు.నాగలలితను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోనేటి చంద్రబాబు, శివరాం, ఆర్‌ఎంఎస్ మహిళలు సుజాత, సుధా బ్రాహ్మణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

మోసానికి పాల్పడితే చర్యలు



తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తూకంలో మోసానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎం.శ్రీరాముడు హెచ్చరించారు. ఆదివారం ఆ శాఖ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్ రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని సి.క్యాంపు రైతు బజారు, పరిసర ప్రాంతాల్లోని కూరగాయలు, పూలు, పండ్ల విక్రయాల వద్ద వినియోగదారులకు అవగాహన కల్పించారు. వ్యాపారులు వాడే తూనిక రాళ్లను పరీక్షించామని, ఎలక్ట్రానిక్ కాటాలను సంవత్సరానికోసి పరీక్ష చేయించి ముద్రలు వేయించుకోవాలని వ్యాపారులకు సూచించారు. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ గౌస్, టీపీ బదీయుద్దీన్, ఆఫీస్ సబార్డినేట్ హేమ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

కాలువలు ఏర్పాటు చేయాలి

కల్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.మార్కాపురం చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌కు కాలువలు ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉలిందకొండలో రైతుసంఘం మండల మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిజర్వాయర్‌ను నీటితో నింపి కాల్వలు ఏర్పాటు చేస్తే 11 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందన్నారు. మహేశ్వరుడు, ఏ.కృష్ణ, మదు తదితరులు పాల్గొన్నారు.

గుంత.. చింత



కర్నూలు నగరంలోని బిర్లాగేట్ సర్కిల్ వద్ద రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు కంకరతేలి గుంతపడింది. గుత్తి పెట్రోల్ బంక్‌వైపు వంతెన నుంచి నిత్యం భారీ వాహనాలు వేగంగా వస్తుంటాయి. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి, రహదారులకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. **- కల్లూరు**

డాక్టర్ల ప్రీమియం లీగ్ ప్రారంభం

- 18 పరుగులతో కేఎంసీ అల్యూమి విజయం

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో డాక్టర్స్ ప్రీమియం లీగ్ ప్రారంభమైంది. కేఎంసీ అల్యూమి టీం, ఆర్థోపెడిక్ బ్లాస్టర్స్, కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్ మరియు పీడియాట్రిక్ పాంథర్స్ జట్లు పాల్గొన్నాయి. రాయల స్పోర్ట్స్ మైదానంలో పోటీలను సుశీల నేత్రాలయ అధినేత డా.సుధాకర్‌రావు ప్రారంభించారు.



కేఎంసీ అల్యూమి, డెంటల్ స్ట్రైకర్స్ జట్లతో డా.సుధాకర్‌రావు

మొదటి క్రికెట్ మ్యాచ్ కేఎంసీ అల్యూమి, డెంటల్ స్ట్రైకర్స్ జట్ల మధ్య జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన కేఎంసీ అల్యూమి జట్టు 20 ఓవర్లలో 170 రన్స్ చేయగా, వరుణ్ 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 40 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డెంటల్ స్ట్రైకర్స్ టీం 20 ఓవర్లలో 6 వికెట్లకు 152 పరుగులు మాత్రమే చేసింది. సుభాష్ 59 పరుగులు సాధించారు. కాగా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రీతమ్ ఎంపికయ్యారు. గ్రాండ్ ఫైనల్ నవంబరు 16న ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బుక్కాపురంలో క్షుద్రపూజల కలకలం



క్షుద్ర పూజలు నిర్వహించిన స్థలం

మహానంది, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురంలో ఆదివారం క్షుద్రపూజలు జరగడంతో కలకలం రేగింది. గ్రామ శివారు ప్రాంతంలోని శ్మశాన స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహిస్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. దాంతో గమనించిన సదరు వ్యక్తులు బైక్‌లపై పరారయ్యారు. శ్మశానంలో చేసిన పూజలను చూసి గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

తుగ్గలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్యంతో బాధ పడుతూ జీవితంపై విరక్తితో జశ్వంత్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం జొన్నగిరి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు ఉప్పర్లపల్లికి చెందిన చంద్రశేఖర్, దివ్య దంపతుల కుమారుడు జశ్వంత్ గత పదేళ్లుగా అనారోగ్యంతో బాధతో వైద్యులతో చికిత్స పొందుతూ జీవితంపై విరక్తి పుట్టి పొలానికి వెళ్లి వాజ్‌మోల్ తాగి వాంతులు చేసుకుంటుండగా.. గమనించిన బంధువులు గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత గొడవలతో వ్యక్తిపై దాడి

నంద్యాల టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పాత గొడవలతో వ్యక్తిపై దాడి జరిగింది. ఈ ఘటన నంద్యాల పట్టణం గాంధీనగర్ ప్రాంతంలో ఆదివారం చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వినాయక చవితి ఉత్సవాల్లో ఫుట్బాల్ నగర్‌కు చెందిన సుభాన్, పరుశురాముడు గొడవ పడ్డారు. అలాగే, సుభాన్ ప్రతిరోజూ హేళన చేసేవాడు. దాంతో విసిగిపోయిన పరుశురాముడు ఆదివారం ఉదయం గాంధీనగర్ జంక్షన్ వద్ద సుభాన్‌పై గొడ్డలితో వెనుక నుంచి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన క్షతగ్రాతుడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిందితుడు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయ్యాడు. పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

అహోబిల నారసింహుడికి శేర్తి పూజ



ప్రత్యేక పూజల్లో నరసింహ స్వామి

ఆళ్లగడ్డ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఆదివారం అహోబిల 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ వారి ఆధ్వర్యంలో శేర్తిపూజ నిర్వహించారు. మాలోల నరసింహస్వామి ఉత్సవ మూర్తిని మూల మూర్తితో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా సుప్రభాతంతో స్వామి వారిని మేల్కోలిపి గద్యత్రయం విన్నవించారు. పీఠాధిపతి భవనాసి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జల క్రీడలు



ప్రథమస్థానం పొందిన ఎన్టీఆర్ జిల్లా జట్టు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గార్గేయపురం చెరువులో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి జల క్రీడలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులుగా నిర్వహించిన నాల్గవ రాష్ట్ర స్థాయి కేనోయింగ్, కయాకింగ్, డ్రాగన్ బోట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర, రాష్ట్ర కేనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బలరాం నాయుడు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పోర్ట్స్ కోటాను మూడు శాతానికి పెంచి అమలు చేసిందన్నారు. క్రీడల నిర్వహణకు రాష్ట్ర స్థాయిలో కర్నూలుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు మంచికంటి అవినాష్, శివారెడ్డి, రుద్ర రెడ్డి, సునీల్ కుమార్, నాగరత్నమయ్య పాల్గొన్నారు.



దేశ సమైక్యతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లా విభాగ్ ప్రచారక్ సురేంద్ర



ప్రార్థన చేస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

ఆత్మకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భారతదేశ సమైక్యతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా విభాగ్ ప్రచారక్ సురేంద్ర పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో విజయ దశమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారక్ సురేంద్ర మాట్లాడుతూ వేల ఏళ్ల చరిత్ర కలిగిన భారతదేశం ప్రపంచానికే జ్ఞానాన్ని, సంస్కృతిని అందించిందన్నారు. స్వతంత్రం కోసం ఒకరిని ఎదుర్కొంటే మరొకరొచ్చి దేశ ప్రజలను బానిసలుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు హిందువుల్లో ఐక్యత లేకపోవడమే ప్రధాన కారణమని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే డాక్టర్ హెడ్గేవార్ గొప్ప ఆలోచనతో స్వాతంత్ర్య పొందిన భారతదేశాన్ని ఏవిధంగా కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే 1925 విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా గుర్తింపు దక్కించుకుందన్నారు. దేశభక్తి, సామాజిక సమగ్రతను ప్రపంచానికి వివరిస్తూ విపత్తుల నుంచి ప్రజల్ని రక్షించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో ఆర్ఎస్ఎస్ నిస్వార్థంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వాసుదేవరెడ్డి, బాణాల లక్ష్మీనారాయణ, మారం భానుమూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టుల పరీక్షలను ఆదివారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల కోసం ఇటీవల బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అభ్యర్థులకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు జిల్లాలో పరీక్ష కేంద్రాలను కేటాయించారని తెలిపారు. పుల్లయ్య కాలేజీలోని పరీక్షకు 261 మంది అభ్యర్థులు హాజరయ్యారని, రెండు విడతల్లో పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే పేపర్-2లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించామని ఎస్పీ అన్నారు. ఏఎస్పీ హుశేన్‌పీరా, తాలుకా సీఐ తేజమూర్తి ఉన్నారు.

పేట్నికోటలో వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనం

కొలిమిగుండ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్కార్పియో వాహనం అదుపు తప్పి సినిమాలో తలపించేలా మూడు పల్టీలు కొట్టింది. ఈఘటన మండలంలోని పేట్నికోట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. అయితే అదృష్టవశాత్తు అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్పగాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కోటపాడు గ్రామానికి చెందిన రామసుబ్బయ్య స్కార్పియో వాహనం పేట్నికోట నుంచి కొలిమిగుండ్లకు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే బాదు గుట్టల్లో పల్టీలు కొట్టింది. గాయపడిని వారిని చికిత్స నిమిత్తం చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించారు. వాహనం పూర్తిగా దెబ్బతింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం సమీపంలో బెంగళూరు నుంచి వస్తున్న కారు, మాధవరం నుంచి ఎమ్మిగనూరు మోటారు సైకిల్‌పై వెళ్తున్న బోయ దుల్లయ్యను ఢీకొట్టింది. దుల్లయ్యకు గాయాలయ్యాయి. అలాగే బూదూరు సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో బోయ గురుస్వామి, సూరయ్య, వీరేష్, వడ్డె కృష్ణమరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో మాధవరానికి గ్రామానికి చెందిన సర్పంచ్ ఇందిరమ్మ, ఆమె భర్త యాకోబు ఆదోనికి బైక్‌పై వెళ్తుండగా.. అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో దంపతులిద్దరికీ గాయాలు కావడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం, మాధవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా ..

బనగానపల్లె అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామ సమీపంలో కైప గ్రామానికి వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 8 మందికి గాయాలైనట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం శిరువెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన చిలకల బోడెన్న కుమారుడు రమేష్ వారి కుటుంబ సభ్యులతో కలసి మొక్కుబడి నిమిత్తం కైప గ్రామంలోని తిమ్మయ్య స్వామి గుడికి వెళ్లి తిరిగి కోటపాడు గ్రామానికి వస్తుండగా టంగుటూరు పెద్దమ్మ గుడి సమీపంలో ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. రమేష్‌తోపాటు ఆయన బంధువు రమేశ్, లక్ష్మీదేవి, మాధురి, లింగమ్మ, తిమ్మయ్య, కావ్యమ్మ, అబ్దుల్ రహీం, దస్తగిరి తదితరులు గాయపడ్డారు, గాయపడ్డ వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. వివరాల మేరకు.. కబడ్డీ ఆటలో వివాదం చోటుకుచేసుకుని కిరణ్ అనే వ్యక్తిపై బోయ భార్గవ్, మరి కొందరు దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని తాలూకా పోలీసులు తెలిపారు.

మూడు లారీలు ఢీ..

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని టీవీ9 కాలనీ వద్ద జాతీయ రహదారిపై మూడు లారీలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.. నంద్యాల నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న ఐచర్ లారీని వెనుక వస్తున్న మరో ఐచర్ లారీ ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన వాహనం ముందే వెళుతున్న లారీని ఢీకొట్టింది. మధ్యలో ఉన్న ఐచర్ వాహన డ్రైవర్ మల్లేష్‌కు గాయాలుకాగా, మరో వ్యక్తి మహేంద్ర కాలు ఫ్రాక్చర్ అయింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జిన్నర్ల విముఖత

3వ పేజీ తరువాయి

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర రూ.8110 ప్రకటించింది. క్వింటాలు గరిష్ఠంగా పత్తిని రూ.7300 మించి కొనుగోలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే క్వింటాలు రూ.900పైగా తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర కంటే తక్కువగా పత్తి ధర పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన ఎరువులు విత్తనాల ధరలు కూలీ ఖర్చులతో మార్కెట్లో పలుకుతున్న ధర తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో ఆదుకోవాల్సిన సీసీఐ, జిన్నింగ్ పరిశ్రమలకు విధించిన కొర్రీతో మరింత కొనుగోలు ఆలస్యం జరిగే అవకాశం ఉంది.

120కి పైగా పరిశ్రమలు

ఉమ్మడి జిల్లాలో 120కి పైగా జిన్నింగ్ పరిశ్రమలున్నాయి. ప్రతి ఏటా సీసీఐకి 20కి పైగా జిన్నింగ్ పరిశ్రమలు అద్దెకు ఇస్తారు. గతఏడాది ఆదోనిలో 10, ఎమ్మిగనూరులో నాలుగు, నంద్యాలలో 3, మంత్రాలయంలో 1, కర్నూలు సమీపంలోని పెంచికలపాడులో 1 జిన్నింగ్ పరిశ్రమ సీసీఐ అద్దెకు నడిపింది. ఆదోని కేంద్రంలోని 5 పత్తి జిన్నింగ్ పరిశ్రమల నుంచి 2024లో కనీస మద్దతు ధరతో సీసీఐ 1,70,673 క్వింటాళ్లు రైతుల నుంచి కొనుగోలు చేసింది. మిగతా కేంద్రాల నుంచి మరో లక్ష క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ పంట చేతికి వచ్చే సమయానికి పత్తి ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా పలుకుతుంది. సీసీఐ విధించిన నిబంధనలు సడలిస్తే తప్ప తాము జిన్నింగ్ పరిశ్రమలు అద్దెకు ఇవ్వలేమని చెబుతున్నారు.

సీసీఐ నిబంధనలు ఇవే..

ఒక బ్రాంచిలో రెండు, మూడు జోన్లుగా చేసి లింట్ పర్సంటేజ్‌లో మార్పులు చేయడంతో పాటు గతంలో కంటే ఎక్కువగా పెంచారు. వంద కిలోల పత్తిలో ఏ నెల ఎంత దూది ఇవ్వాలనే నిబంధన పెట్టారు. గతంలో ఇది నెలవారీగా ఉండేది. ఈ సీజన్‌లో రెండుసార్లు ఇవ్వాలని సూచించారు. 100 కేజీల పత్తికి దూది 97.5 కేజీలు ఇవ్వాలంటుంది. బేలు తయారు చేసే సమయంలో గతంలో లోటు (షార్టేజ్) 3.15 నుంచి 1.90 శాతం ఉండేది. దాన్ని 1.25 నుంచి 0.75 శాతానికి తగ్గించారు. చెత్త 2.5 శాతం విధించింది.

- ప్రతి జిన్నింగ్ పరిశ్రమలో అధునాతన సౌకర్యాలతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు ఆరు నెలలపాటు డేటా ఏఐ అనాలసిస్ భద్రంగా స్టోరేజ్ కలిగి ఉండాలి.

ఎల్ వన్, ఎల్ టూ, ఎల్‌త్రీ విభజన చేయడంపై ఈ నిబంధనలు బేళ్ల ధర జిన్నింగ్‌లో సౌకర్యాలు తదితర వాటిపై చర్చలు జరిపిన తర్వాతనే టెండర్లకు వెళ్తామని కాటన్ అసోసియేషన్ అంటోంది.

నిబంధనలు సడలిస్తేనే..



సీసీఐ విధించిన కొత్త నిబంధనలు సడలిస్తే తప్ప తాము టెండర్లలో పాల్గొనలేం. ప్రతి జిన్నింగ్ పరిశ్రమలో పదివేల బేళ్ల దూది ఉత్పత్తి చేస్తామని హామీ ఇస్తే అధునాతన సౌకర్యాలు కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదు.

● వెంటకటరామి రెడ్డి, కాటన్ మర్చంట్, ఆదోని

మంకు పట్టు వీడాలి



సీసీఐ మంకు పట్టు వీడి రైతులకు మేలు చేకూర్చేలా కనీస మద్దతు ధరతో కొనుగోలుకు ముందుకు రావాలి. వారు విధించిన కొత్త నిబంధనలు తమకు నష్టం చేకూర్చేలా ఉన్నాయి, నిబంధనలు సడలిస్తే తప్ప తాము జిన్నింగ్ పరిశ్రమలను అద్దెకు ఇవ్వలేం.

- బత్తిని కుబేర నాథ్, ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ పరిశ్రమ యజమాని, ఆదోని



దేవరగట్టులో కర్రలతో తలలు పగిలేలా చేసుకునే ఉత్సవమే కాదు... పరిసర ప్రాంతాలు సైతం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతంలో మనసు పెట్టి చూస్తే ప్రతీది ప్రకృతి సౌందర్యమే. కనుచూపు మేర కనిపించే కొండల్లో అద్భుతమైన చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది. హొళగుంద మండలం దేవరగట్టుకు వెళ్లే మార్గంలో కొండలపై ఓ బండరాయిని దూరం నుంచి చూస్తే లేపాక్షి నందిని పోలినట్లు కనిపించింది. 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా.. కైలాస శిఖరిలా కదలిరావయ్యా..' అంటూ ప్రఖ్యాత తెలుగు రచయిత, చిత్రకారుడు అడవి బాపిరాజు ఓ సారి లేపాక్షికి వెళ్లినప్పుడు చెప్పిన మాటలు ఈ దేవరగట్టు నందికి కూడా సరిపోయేలా ఉన్నాయి.

- హొళగుంద

ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

పొగాకు పంట ధ్వంసం.. కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గార్గేయపురం గ్రామంలో సాగుచేసిన పొగాకు పంటను ధ్వంసం చేసినవారిపై తాలూకా పోలీసులు కేసు నమోదు నమోదు చేశారు. వివరాల మేరకు.. గ్రామంలోని వక్ఫ్‌బోర్డు భూముల్లో మహ్మద్ రఫీ మరికొంతమంది ముత్తావర్లు పొగాకు పంటను సాగు చేసుకుంటున్నారు. కాగా షమీవుల్లా, కిరణ్ అనే వ్యక్తులు మరికొంత మందితో కలిసి ట్రాక్టరుతో పంటను ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్ప్రవర్తన ఉంటే సాయం చేస్తాం : సీఐ

రౌడీ షీటర్లకు పోలీసుల వినూత్న కౌన్సెలింగ్



నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవరచుకుంటే అన్ని విధాలా సాయం చేస్తామని నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లు, నేరచరిత్రగల వారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ పిల్లల చదువుల విషయంలో విద్యాసంస్థల యాజమాన్యంతో మాట్లాడి ఫీజులు తగ్గించేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనారోగ్య, వ్యక్తిగత సమస్యలు ఉంటే పరిష్కార మార్గాలు చూపిస్తామన్నారు. పది సంవత్సరాల పాటు కేసు నమోదు కానివారిపై రౌడీషీట్లు తొలగించడానికి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. మారిన వారికి పోలీసు అధికారుల సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు.

ఆస్తి వివాదం.. నలుగురిపై దాడి



దాడిలో గాయపడిన లక్ష్మి, మహలక్ష్మి

బేతంచెర్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామంలో ఆస్తి విషయంలో ఆదివారం ఘర్షణ జరిగింది. లక్ష్మి, మహలక్ష్మి, సుజాత మాధవ లక్ష్మిలపై శేఖర్, భార్య శ్యామల, తమ్ముడు మధు కత్తితో దాడి చేశారు. శేఖర్, తమ్ముడు మధు గత కొంత కాలం నుంచి తల్లి సుభద్రమ్మతో ఆస్తి విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై సుభద్రమ్మ కుమార్తెలు ఆర్.కొత్తపల్లి గ్రామానికి వచ్చి సమస్య పరిష్కారం కోసం చర్చిస్తుండగా.. మధు మహిళలపై కత్తితో దాడి చేశారు. గాయపడిన వారిని బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తపాలా వారోత్సవాలు

పత్తికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వతేదీ నుంచి 14వతేదీ వరకు తపాలా వారోత్సవాలు జరుగుతాయని పత్తికొండ సబ్ పోస్టుమాస్టర్ నాగరాజు తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా పత్తికొండ పోస్టాఫీస్‌లో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నామని కొత్తగా కార్డు నమోదు, మార్పులు చేర్పులు చేసుకునేవారు ఈ ఆధార్ క్యాంపుద్వారా అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుండెను సంరక్షించుకోవాలి

దేవనకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు ఆరోగ్య నియమాలు పాటిస్తూ గుండెను సంరక్షించుకోవాలని కార్డియాలజీస్టు డీఎం సందీప్‌కుమార్ తెలిపారు. స్థానిక జ్ఞానసుధా పాఠశాలలో కర్నూలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ, టుడిఎకో, సిరం క్రియాటిన్, బీపీ, షుగర్ పరీక్షలు 70 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. 13 మందికి గుండె సంబంధిత వ్యాదులు అధికంగా ఉండటంతో మెరుగైన వైద్య పరీక్షల కోసం కర్నూలుకు పంపారు. డీసీ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం



పాల్గొన్న జేఏసీ నాయకులు

ఆదోని టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా ఏర్పాటు చేస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధికు అవకాశం ఉంటుందని ఆదోని జిల్లా సాధన జేఏసీ గౌరవ సలహాదారులు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, కన్వీనర్లు నూర్ అహ్మద్, కోదండ అన్నారు. ఆదివారం భీమాస్ హోటల్ లో దస్తగిరి నాయుడు అధ్యక్షతన జేఏసీ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రజలందరికీ వివరించి ఉద్యమంలో పాల్గొనేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. . జిల్లా సాధనలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా ఉద్యమ ప్రచారాన్ని నిర్వహించడానికి నిర్ణయం తీసుకొన్నారు. ఆదినారాయణ, నీలకంఠప్ప, వామపక్ష, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంటలు తొలగింపు


కంది పంటను తొలగిస్తున్న రైతు

చిప్పగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల కారణంగా ఎండిపోయిన పంటను రైతులు తొలగిస్తున్నారు. చిప్పగిరి మండలంలో కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, మిరప, పత్తి పొలాల్లో వర్షం నీరు నిలవడంతో పైరుకు వేరు కుళ్లు తెగులు సోకి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో కొందరు రైతులు వాటిని తొలగించి రబీలో ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు. చిప్పగిరి గ్రామానికి చెందిన రైతు మనోహర్ బంటనహాల్‌కు వెళ్లే దారిలో రెండు ఎకరాల్లో కంది పంటను సాగు చేశాడు. దాదాపు రూ.50 వేలు ఖర్చు పెట్టి రెండు నెలలుగా పంటను సాగు చేస్తున్నాడు. వర్షాలు కురవడంతో పొలంలో వర్షం నీరు నిలిచి ఎండిపోయింది. దీంతో చేసేది లేక రైతు కంది పైరును తొలగించి జొన్న సాగు చేయడానికి సిద్ధమవుతున్నాడు. నష్టపోయిన తమలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు మనోహర్ కోరుతున్నాడు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు, ప్రజలు, ఖాతాదారులు కోఆపరేటివ్ సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సహకార సంఘం అధ్యక్షులు ఎడవలి ఆనంద్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా మద్దికెర సహకార సంఘం ఆధ్వర్యంలో ఖాతాదారులు నిల్వ ఉంచే డిపాజిట్లపై వడ్డీ ధరలు పెంచడం జరిగిందని తెలిపారు. బంగారు ఆభరణాలపై 8.5 శాతం పైసలు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఒక గ్రాముకు రూ.7,500 వరకు అప్పు ఇస్తామన్నారు. సహకార సంఘం అభివృద్ది కోసం కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

విపత్తుగా ప్రకటించాలి

దేవనకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో రైతులు పంటలు నష్టపోవడంతో, అతివృష్టిని విపత్తుగా ప్రకటించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌పార్టీ జిల్లా నాయకులు మునిస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌పార్టీ అధ్వర్యంలో మండలాన్ని అతివృష్టి విపత్తుగా ప్రకటించాలని ఆందోళన చేశారు. వేలాది రూపాయాలతో పంటలు సాగు చేస్తే, అధిక వర్షాలకు పెట్టుబడులు రాలేదన్నారు. మండలంలో పంటలు సాగు చేసిన ప్రతి ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం రైతులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ అసిస్టెంట్ రవికి వినతిపత్రం ఇచ్చారు

రేషన్ డీలర్ నిర్లక్ష్యం

హొళగుంద, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాప్‌లో ఇచ్చే సరుకుల కోసం ఎదురు చూసే నిరుపేదలు వాళ్ళు కూటమి ప్రభుత్వం రేషన్ కార్డు దారులు సమస్యలను గుర్తించి ప్రతినెల ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపులు అందుబాటులో ఉండేలా ఉత్తర్వులు జారీ చేసినా ఓ డీలర్ నాలుగు రోజులు గడిచిన సరుకుల పంపిణీ చేయలేదు. గత నెల పంపిణీ చేసిన రేషన్ బియ్యం తూకంలో అవకతవకలకు పాల్పడుతూ తన చేతివాట ప్రదర్శిస్తూ బియ్యం, బ్యాలు, చెక్కెర ఇవ్వకుండా కార్డుదారుల కడుపుకొడుతున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వారం రోజులు మాత్రమే బియ్యం వేస్తాడని ఊళ్లగడ్డే ఈరన్న అనే గ్రామస్థుడు తెలిపాడు. డీలర్‌పై అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదని వందవాగాలి గ్రామానికి చెందిన కురువ హనుమంతు తెలిపాడు. ఈ విషయంపై తహసీల్దార్ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా సదరు డీలర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐద్వా జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ఆలూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి షేకున్‌బీ అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతిబసు భవనంలో ఐద్వా మండల స్థాయి సమావేశం గౌసియాబీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా షేకున్‌బీ మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. మద్యపానం నిషేధించాలని, అత్యాచారాలపై న చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘాటు తగ్గిన మిర్చి..

- కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి
- ప్రతి ఏటా వర్షాకాలంలో నష్టాలే
- ఆదుకోవాలంటున్న అన్నదాత


మిర్చిని గ్రేడింగ్ చేసి ప్యాకెట్లకు నింపుతున్న రైతులు


ఆస్పరి మార్కెట్‌లో వేలం వేస్తున్న వ్యాపారులు

ఆస్పరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో శ్రమ పెట్టుబడితో కూడిన మిర్చి ఘాటు తగ్గింది. కనీస గిట్టుబాటు ధరలు లభ్యంకాకపోవడంతో పెట్టుబడి, కూలీలకు, ఖర్చులకు కూడా రాని పరిస్థితి. మిర్చి పంట సాగుచేసిన రైతులు ఈ ఏడాది నష్టాలు చెవిచూస్తున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.12 నుంచి రూ.18 కూడా ధరలు పలకడం లేదు. మండలంలో సాగుచేసిన మిర్చి పంటకు ఎంతో ఆశతో అధిక పెట్టుబడులు పెట్టి పంటను సాగుచేస్తే తీరా కురిసిన భారీ వర్షాలకు పంట దిగుబడులు నాణ్యత కోల్పోవడంతో ధరలు కూడా అమాంతంగా తగ్గిపోయాయి. ప్రతిఏటా వర్షాకాలం సీజన్‌లో నష్టాలు చవిచూస్తున్నారు. 20 కేజీల మిర్చి ప్యాకెట్ మార్కెట్లలో రూ.150 నుంచి రూ.250కు పలకడం లేదు. మండలంలో బోరుబావుల కింద సాగుచేసిన మిర్చి గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చికి కనీసం కిలో రూ.50 పలికితే తప్పా గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఒక ఎకరా పొలంలో మిర్చి పంటను సాగుచేయాలంటే రూ.లక్ష దాకా పెట్టుబడి వస్తుంది. సేద్యం ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, స్ప్రే మందులు, కూలీలతో పాటు తమ కుటుంబం మొత్తం కష్టపడితే తప్పా పంట దిగుబడి చేతికి రాదు. ఇలాంటి పరిస్థితుల్లో మిర్చి రైతులు కష్టపడి పండించిన దిగుబడికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.

- ఈరన్న, ఆస్పరి రైతు

నాణ్యత ఉన్న సరుకుకు డిమాండ్



అధిక వర్షాల వల్ల కూరగాయల పంట దిగుబడులు నాణ్యత కోల్పోయాయి. వర్షాలు తగ్గితే కూరగాయల ధరలు పెరిగే సూచన ఉంది. నాణ్యత ఉన్న సరుకుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ఆ దిశగా పంట దిగుబడులను మార్కెట్‌కు తీసుకురావాలి.

బిల్లేకల్ వెంకటేష్, ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్

పెరవలి పంచాయతీకి స్వచ్ఛతా పురస్కారం



స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం చేపడుతున్న దృశ్యం

మద్దికెర అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామ పంచాయతీ జిల్లా స్థాయి స్వచ్ఛతా పురస్కారానికి ఎంపికైంది. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రకటించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేదం, సుస్థిర వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్దతుల్లో చట్ట ప్రమాణాలను నెలకొల్పడంతో ఈ పంచాయితీని ఎంపిక చేశారు. ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీ నుంచి సెప్టెంబరు 27 వరకు చేపట్టిన సర్వే ఆధారంగా ఈ పెరవలి పంచాయతీ కార్యదర్శికి అవార్డును సోమవారం 6వ తేదీ కర్నూలులోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. పెరవలి గ్రామంలో సర్పంచ్ మల్లికార్జున, కార్యదర్శి సుధాకర్ పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా బాగా తగ్గించారు. మురుగు కాలువల శుభ్రత, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన లేకుండా చేపట్టారు. ప్రతి ఇంటి ముందు చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువును తయారు చేస్తున్నారు. 15 రోజులకు ఒకసారి పంచాయతీలో డ్రైనేజీలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. గతంలో కూడా పెరవలి పంచాయతీ అవార్డుకు ఎంపికైంది. పెరవలి పంచాయతీకి అవార్డు రావడంతో పలువురు అభినందించారు.

అబ్బో గబ్బు..


బురదమయంగా మారిన ప్రధాన రహదారి

చిప్పగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం ఏరూరు గ్రామంలో ప్రధాన రహదారిలో మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. కురుస్తున్న వర్షాలకు గ్రామం మొత్తం బురదమయంగా మారడంతో దోమలువ్యాప్తి చెంది అనారోగ్యాల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువుల కోసం పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ చేయూత నిచ్చింది. ఆదివారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్లా, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి చిన్మయ విద్యాలయంలో విద్యార్థులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగరాజు, రేణుక దంపతుల కూతురు ఇందు ఎంబీబీఎస్ సీట్ రావడంతో అడ్మిషన్ పీజును రూ. 16,750, బీటెక్ చదివించేందుకు రంగముని, సంధ్య కుమారుడు నవీన్‌కు రూ. 16,750, పదో తరగతి చదువుతున్న ఆలియాకు రూ. 12000 నగదును అందజేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపకుండా చదువులకు తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లోనూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సభ్యులు శ్రీధర్ రెడ్డి, విట్ట మురళి, రాయచోటి సుబ్బయ్య, సునీల్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వినోద్, ప్రశాంత్ గాంధీ పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యమే కారణం

ఆదోని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్ని ఉత్సవంలో ఈనెల 3వ తేదీన తెల్లవారుజాము జరిగిన ఘర్షణలో ఇద్దరు మృతిచెందడం, వంద మందికి పైగా గాయపడడానికి రాష్ట్ర ప్రభుత్వ, పోలీసుల భద్రతా వైఫల్యమే కారణమని ఏపీ హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.జి.శ్రీనివాసులు అన్నారు. మృతిచెందిన కుటుంబాలకు, గాయపడిన వారికి తగిన నష్టపరిహారం ఇవ్వడంతోపాటు ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

విభేదాలు వీడి పార్టీ కోసం కష్టపడాలి

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి


కార్యకర్తలతో వైకుంఠం జ్యోతి

దేవనకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలో విభేదాలు వీడి రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు, నాయకులు కష్టపడాలని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికలలో ఆలూరులో అన్ని గ్రామాలలో టీడీపీ జెండా రెపరెపలాడాలన్నారు. ఆనంతరం స్థానిక లక్ష్మీరంగా కళ్యాణమండపంలో నిశ్చితార్థ వేడుకలకు హజరైయ్యారు. వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ, మండల కన్వీనర్ విజయ్‌బాస్కర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

నేడు ధర్నా

మద్దికెర అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి పెరవలి సుధాకర్, నెట్టికంటయ్య అన్నారు. ఆదివారం మద్దికెరలో కరపత్రాలు విడుదల చేశారు. సోమవారం జరిగే ధర్నా కార్యక్రమానికి మండలంలోని సీపీఐ పార్టీ నాయకులు, రైతులు తరలిరావాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నబీరసూల్ హాజరు కానున్నారు.

టీడీపీలో చేరిన కుటుంబాలు

ఆదోని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం జి.హొసల్లి గ్రామంలో వైసీపీ 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు సమక్షంలో టీడీపీలోకి చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. టీడీపీలోకి చేరిన వారిలో ఎస్.ముక్కన్న, కె.హరీష్, సి.సతీష్, కె.వెంకటేష్, ఎస్.మహేష్, కోడికి వెంకటేష్, కె.పరమేష్, కె.మల్లికార్జున, వి.చంద్ర, బి.రవి, కె.చంద్ర ఉన్నారు. ఈ కార్యక్రమంలో జి.హొసల్లికి చెందిన టీడీపీ నాయకులు రాఘవేంద్ర, గోపాల, మహాదేవ, దేవన్నతో పాటు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే చంద్రబాబు నైజం


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆదోని టౌన్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : చెప్పింది చేయడమే బాబు నైజం, చెప్పకుండానే ఆటో డ్రైవర్‌లకు రూ. 15000 అందించడం ఆయన మంచితనానికి నిదర్శనమని మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి అన్నారు. మండిగిరి ప్రాంతానికి చెందిన 22 మంది ఆటో డ్రైవర్ల ఖాతాలలో రూ. 15వేలు, జమకావడంతో ఆదివారం సచివాలయం కార్యాలయం వద్ద టీడీపీ నాయకుడు రంగ స్వామి నాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల చిత్ర పటాలకు డ్రైవర్లు పాలాభిషేకం చేశారు. ఊహించని ఈ కానుక అందజేసినందుకు ఆటో డ్రైవర్లు తమ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది స్వర్ణలత, శివశంకర్, సురేష్, శ్రీనివాస ఆచారి, జనసేన నాయకుడు మంజు పాల్గొన్నారు.

పత్తికొండలో బోయ, వాల్మీకుల ర్యాలీ

పత్తికొండ టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో ఆదివారం బోయ, వాల్మీకి సమితి ఆధ్వర్యంలో వాల్మీకులు పట్టణ పురవీధులగుండా ర్యాలీ నిర్వహించారు. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునఃరుద్ధరించాలని, వాల్మీకి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో వాల్మీకులు పట్టణ పురవీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి హాజరై ప్రసంగించారు. వాల్మీకుల హక్కుల పరిరక్షణకై తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు, సింగిల్ విండో ప్రెసిడెంట్ రంగప్ప, చక్రాళ్ల ఎంపీటీసీ రాజు, కనకదిన్నె ఆదినారాయణతో పాటు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న బొజ్జమ్మ

దేవనకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్లు మహిళలకు చేయుతనందిస్తుందని వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ అన్నారు. మండలంలోని గుండ్లకొండలో రాయితీ 35 కుట్టుమిషన్లు గ్రామానికి చెందిన మహిళలకు పంపిణి చేశారు. కుటుంబ ఆర్థిక స్వాలంభనకు కుట్టు మిషన్లు ఉపయోగపడుతాయని ఆమె అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, గుండ్లకొండ రాందాస్‌గౌడ్, ఉచ్చీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


పంటలు పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆదోని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు డిమాండ్ చేశారు. అధిక వర్షాలకు అతలాకుతలమైన పంట పొలాలను వారు పరిశీలించారు. ఆదివారం రైతులతో కలిసి గణేకల్లులోని పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది అధిక వర్షాల వలన రైతులు పండించిన పంటలు నీటిలో కలిసిపోయాయని, అయితే ఇంతవరకు కూడ ప్రభుత్వం సహాయం ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లింగన్న, వీరారెడ్డి, విరుపాక్షి, తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లు పూర్తి చేసుకున్న ఆర్ఎస్ఎస్



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

ఆదోని టౌన్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయని, ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ నగర సంచాలక్ బుగ్గా రమేష్, స్వయం సేవక్ మరియాని చెన్న బసప్ప అన్నారు. ఆదివారం వీరు మాట్లాడుతూ జాతీయ భావాలతో దేశభక్తి, ధర్మం కోసం పనిచేసే సభ్యులను తయారుచేయడమే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అని అన్నారు. దేశం సుభిక్షంగా ఉండటమే కాకుండా బలోపేతం కావాల్సిన అవసరముందని అన్నారు. సమావేశంలో జిల్లా సమా ప్రచార ప్రముఖ్ చిత్తారి వెంకటేష్, నగర ప్రచార ప్రముఖ్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉల్లి పంట.... గొర్రెలు, మేకలకు మేత


ఉల్లి పంటను మేస్తున్న గొర్రెలు, మేకలు

పత్తికొండ టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యయప్రయాసాలు ఓర్చి పెట్టుబడులు పెట్టి ఉల్లి పంటను సాగుచేసిన రైతన్నలకు ఈ ఏడాది కూడా నిరాశే మిగిల్చింది. కోటి ఆశలతో ఈ ఏడాది అయినా ఉల్లి పంట గట్టెక్కిస్తుందన్న ఆశలతో ఉల్లి పంటను సాగుచేసిన రైతన్నలకు పంట చేతికొచ్చాక ధర పతనమై రైతు కంట ఉల్లి కన్నీరు పెట్టిస్తోంది. రైతులు ఉల్లి పంటపై ఆశను వదులుకుని పొలాల్లోనే చేతికొచ్చిన ఉల్లిగడ్డలను వదిలేసి గొర్రెలు, మేకలకు మేతగా వదిలేస్తున్న సంఘటన ఆదివారం పత్తికొండ మండలం పెద్దహుల్తిలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.... పత్తికొండ మండలంలో ఖరీఫ్ సాగు కింద ఉల్లి పంటను రైతులు 2600 హెక్టార్లలో సాగుచేశారు. అయితే ఉల్లి పంట రైతులకు చేతికొచ్చే సమయానికి ధర పతనం కావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. ఉల్లి పంటను పెరికేసి పొలాల్లోనే వదిలేసి అటు గొర్రెలు, ఇటు మేకలకు ఆహారంగా వదిలేస్తున్నారు. మరికొందరు ఉల్లి పంటను పెరికిస్తే కూలీలకు కూడా డబ్బులు రావని తెలిసి ట్రాక్టర్‌తో దున్నేస్తున్నారు.

లాంగ్వేజ్ పండిట్లను ఉన్నతీకరించడం అభినందనీయం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న లాంగ్వేజ్ పండిట్ పీఈటీ పోస్టులను ఉన్నతీకరించడం అభినందనీయమని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. శనివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండల ముఖ్యనాయకుల సమావేశం సుధాకర్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ పండితులతో పాటు పీఈటీలను రాష్ట్రవ్యాప్తంగా 1250 పోస్టులు ఉన్నతీకరించడం ద్వారా వారందరికీ పదోన్నతి లభించింది అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పండిత్ పీఈటీల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూన్నామన్నారు. తమ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వార చొరవ ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక బకాయిలు, డీఏ, పీఆర్‌సీని వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అకాడమిక్ కౌన్సిలర్ మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, మండల నాయకులు రామాంజనేయులు, ఆంజనేయ భాస్కర్ పాల్గొన్నారు.

'చలో విజయవాడను జయప్రదం చేయండి'

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వేంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి పాఠాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అసెస్మెంట్ పుస్తకాల మూల్యాంకనం సరళీకరించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డి ఏలను విడుదల చేయాలని సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. అలాగే పదవీ విరమణ చెందిన ఉద్యోగుల గ్రాట్యూటీ, పీఎఫ్ తదితర బెనిఫిట్స్ సకాలంలో చెల్లించాలని కోరుతూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబరు 7వ జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, బాబయ్య, శేఖర్, సరళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం


జెండాను అవిష్కరిస్తున్న కాటికాపర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజా రమేష్

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేవీపీఎస్ 27వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణ, మండలాల్లో జెండా అవిష్కరణ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, కాటికాపర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజా రమేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవ సహాయం మాట్లాడుతూ కేవీపీఎస్ స్థాపించి నేటికి 27 సంవత్సరాలు పూర్తి చేసుకొని అత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన పోరాట లక్ష్యాలతో దళితుల పక్షాన నిలబడి రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. స్మశానాల సమస్యలు, కెంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేటర్లకు తాకట్టు పెడుతున్నాడని అన్నారు. మరో పక్క దళితులపై దాడులు అత్యాచారాలు ఇంకా కొనసాగుతునే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నప్ప, రాముడు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలు తల్లి ఒడికి..



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన రెండున్నరేళ్ల బాలిక శరణ్య, సీరియాస్ ఒడియార్ అనే ఆరేళ్ల బాలుడు తప్పిపోయారు. వారి తల్లిదండ్రులు మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ గాలింపు చర్యలు చేపట్టారు. వారి ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు అన్నపూర్ణ, అనంతరెడ్డిలకు అప్పగించారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎమ్మిగనూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అండర్ - 19 జాతీయస్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీలకు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సంజయ్ లక్ష్మణ్‌రాజ్ ఎంపికయ్యాడు. పట్టణానికి చెందిన పీఈటీ నరసింహరాజు కుమారుడు సంజయ్ లక్ష్మణ్‌రాజ్ విజయ వాడలోని కానూరు నారాయణ సూ పర్ విజ్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. గతనెల సెప్టెం బర్‌లో విజయవాడలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా తరుపున పాల్గొని మంచి ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

దీంతో గత నెల సెప్టెంబరు 23,24,25 తేదీలలో ఎమ్మిగనూరు పట్టణంలో జరిగిన పోటీల్లో కృష్ణజిల్లా తరుపున ఆడి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలు ఈనెల ఆరో తేదినుంచి 10వ తేదివరకు జమ్ము కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరగనున్నాయి. ఈ పోటీల్లో సంజయ్ లక్ష్మణ్ రాజ్ పాల్గొనన్నుడు. ఇప్పటికే రాష్ట్ర జట్టు శ్రీనగర్‌కు చేరుకున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ రామవేంద్ర తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘువేంద్ర రెడ్డి ● మాధవరంలో తాగునీటి ట్యాంకులు ప్రారంభం


నీళ్ల ట్యాంకులను ప్రారంభిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘువేంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం మాధవరం గ్రామంలో బుడగజంగాల కాలనీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడు గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలతో 2 బోర్లను వేయించి రెండు గుమ్మీలతో నీరు నిల్వ ఉండేలా ఏర్పాట్లు చేసి ప్రారంబించారు. దీనిని రిబ్బన్‌కట్ చేసి కాలనీ ప్రజలకు తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి తాగునీరు అందిస్తామని తెలిపారు. చాలా ఏళ్లుగా బుడగజంగాల కాలనీలో ఇబ్బం దులు పడేవారని తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ఎం గోపాల్ రెడ్డి, గుర్నింటి భీమిరెడ్డి, టీడీపీ అధ్యక్షులు రామకృష్ణ, ఇందిరమ్మ, రామలింగ, సతీష్, లక్ష్మన్న, సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీకి మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో ప్రధాన రహదారిలో డ్రైనేజీ పారుతుండటంతో మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి స్పందించి మరమ్మతులు చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో రోడ్డుపైకి డ్రైనేజీ అనే వార్త ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన ఎంపీడీవో నూర్జహాన్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది, అండర్ డ్రైనేజీకి మరమ్మతులు చేసి అందులో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించేశారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నాటికి నిల్వ ఉన్న డ్రైనేజీ నీటిని తొలిగించేసి శుభ్రం చేసి రాకపోకలకు అనుకూలంగా చేశారు.

టీడీపీ యువ నాయకుడు మృతి


విష్ణుప్రసాద్ శెట్టి (ఫైల్)

కోసిగి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోసిగికి చెందిన మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు పెండ్యాల ఆదినారాయణ శెట్టి కుమారుడు పెండ్యాల విష్ణుప్రసాద్ శెట్టి (35) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కోసిగి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలో పదేళ్ల పాటు కోసిగి మండల టీడీపీ అధ్యక్షుడిగా, ఆర్లబండ సహకార సంఘం ప్రెసిడెంటుగా పని చేసిన ఆదినారాయణశెట్టి టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన బళ్లారిలో ఉంటున్నాడు. అయితే.. కుమారుడు విష్ణుప్రసాద్‌శెట్టి గుండెపోటుకు గురై అకాల మరణం చెందగా.. విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు 9 నెలల క్రితమే వివాహం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, కోసిగి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు.

అదనపు పోలీసులతో ట్రాఫిక్ నియంత్రణ


ట్రాఫిక్ నియంత్రణపై సూచనలిస్తున్న దృశ్యం

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో పోలీసులు ట్రాఫిక్ అదనపు సిబ్బందితో ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ట్రాఫిక్‌తో భక్తుల అవస్థలు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన డీఎస్పీ భార్గవి, సీఐ రామాంజులు, ఎస్ఐలు శివాంజల్ ట్రాఫిక్‌ను నియంత్రించారు. మాధవరం, ఎమ్మిగనూరు, నాగలదిన్నె ప్రధాన రోడ్డులో ఉన్న ఇరువైపులా ఉన్న వాహనాలను ఊరుబయట ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలానికి తరలించారు. మాధవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం పోలీస్ స్టేషన్ల నుంచి అదనపు సిబ్బందితో పాటు హోంగార్డులు ఐదు మంది, హెడ్ కానిస్టేబుల్స్, సిబ్బంది 8 మందితో ట్రాఫిక్‌ను కట్టడి చేశారు. దీంతో ఆటోలను రాఘవేంద్ర సర్కిల్ వరకే కట్టడి చేయడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చేశారు. సెలవు దినాలు, గురువారం, ముఖ్యమైన రోజుల్లో భక్తుల రద్దీ పెరగడంతో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేయడం అభినందనీయమని భక్తులు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గోనెగండ్లలో భజన పోటీలు

గోనెగండ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో చింతలాముని నల్లారెడ్డి స్వాముల వారి మాస పూజల సందర్భంగా జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటి సభ్యులు తెలిపారు. మాస పూజలు అక్టోబరు 11వ తేదిన జరుగుతుందన్నారు. భజన పోటీలు కూడ ఆదే రోజు రాత్రి దేవాలయ ప్రాంగణం నందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 30 తులాల వెండిని జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, రెండబహుమతి 20 తులాలు వెండిని కే నాగరాజు, ఎంకే వెంకటేశ్వర్లు, మిత్రబృందం, మూడవ బహుమతి 15 తులాల వెండి డి. రామకృష్ణ, అందజేస్తున్నారు. అలాగే నాల్గొబహుమతి పదిన్నర తులాల వెండి, ఐదవ బహుమతి 10తులాల వెండి, ఆరో బహుమతి 8 తులాల వెండి, ఏడవ బహుమతి 5.1/2తులాల వెండి, ఎనిమిదవ బహుమతి 5 తులాల వెండి, తొమ్మిదవ బహుమతి 2.5తులాల వెండి, 10 వ బహుమతి రెండుతులాల వెండి ఇస్తున్నట్లు తెలిపారు. పోత్సాహక బహుమతులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు రూ. 500 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకొవాలని ఇతర వివరాలకు 9912050356, 9885637504 లను సంప్రదించాలని కోరారు.

పాఠశాలల భవనాలను వెంటనే పూర్తి చేయాలి



మట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్

గోనెగండ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోన చిన్నమరివీడు, కులుమాల గ్రామాలలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తి చేయాలని జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సాయిఉదయ్, గోనెగండ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్, పవన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చిన్నమరివీడు, కులుమాల గ్రామాలలో నిర్మాణం లో ఉన్న పాఠశాలలను వారు పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పనులు మధ్యలోనే అగిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమీ ప్రభుత్వం పాఠశాలలభవిష్యత్తు మార్చుతామని చెప్పి వాటి పనులను పూర్తి చేయడం లేదన్నారు. విద్యార్థులు త రగతి గదులు లేక పోవడంతో చెట్ల కింద చదువుకోవాల్సి వస్తుందని వారు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తరగతి గదుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు జిలాని, వినయ్, ఓంకార్, శ్రీను, అన్నమయ్య పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో నడిపే ప్రతి డ్రైవర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు వీరేష్, తిమ్మగురుడు, నరసింహారెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేవలం ఆటో యజమానులకు మాత్రమే డబ్బు జమ చేయడం దారుణమన్నారు. ఎన్నికల హామీల్లో ఆటో కార్మికులకు చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దసరా కానుక ఇస్తానంటూ మోసపూరిత సభనిర్వహించారన్నారు. ఆటో కార్మికులకు అరచేతిలో తేనెరాశారన్నారు. ఉచిత బస్సులేని సమయంలో గత ప్రభుత్వం రూ.10వేలు అందజేస్తే తాను డ్రైవర్లందరికి రూ.15వేలు ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు ఫ్రీ బస్సు భారంపెట్టి అందరు డ్రైవర్లకు కాకుండ కేవలం ఓనర్‌లకు మాత్రమే పథకాన్ని అందజేయడం ఏమిటన్నారు. వాహనమిత్ర పథకం పేరును ఆటో డ్రైవర్లకు సేవలో పథకంగా పేరుమాత్రమే మార్చారని, పాత నిబంధనలు యథావిధిగా కొనసాగించడం ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. విజయేంద్ర, సుంకన్న, రాజు, మధు, ఈరన్న, నారాయణ, నరసింహులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ప్రజలు, రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు భూ సమస్యలు ఉన్నా, ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఇళ్లమధ్య వర్షం నీరు : ఇబ్బందుల్లో కాలనీ వాసులు


తిరుమల నగర్‌లో ఇళ్లమధ్యలో నిలిచిన వర్షం నీరు.. రహదారిపై వాన నీరు

ఎమ్మిగనూరు, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం నీరు తిరుమల నగర్‌లో ఇళ్లమధ్య, ఇళ్లపక్కలో నిలిచిపోవటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లనుంచి రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీకంత కలిపి ఒకే ఒక్క సీసీరోడ్డు మాత్రమే ఉంది. మిగతా రహదారులన్ని మట్టిరోడ్లు కావటంతో వర్షం నీరు ఎక్కడిక్కడే నిలిచిపోతున్నాయి. కాలనీలో సీసీ రోడ్లుతో పాటు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో వర్షం నీరు దిగువకు వెళ్లే అవకాశం లేకపోవటంతో ఇళ్లమధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లోను, ఇంటి ముందు మట్టి రోడ్లపై నిలిచి పోతున్నాయి. ఖాళీస్థలాల్లో భారీగా నిలిచి పోతుండటంతో రోజులు గడిచే కొద్ది ఆనీటిపై దోమలు వాలి వ్యాధులు ప్రభలటంతో పాటు నీరు దుర్గం వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిలువ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

కోసిగి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల కోసిగి మండలంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం కోసిగిలో అధికవర్షాల వల్ల నష్టపోయిన వేరుశనగ, టమోటా, పత్తి రైతుల పంటలను పరిశీలించి ప్రభుత్వం ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం అందిం చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు రావడం వల్ల రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోసిగి మండలాన్ని కరువు మండలంగా ప్రకించాలని డిమాండ్ చేశారు. టమోటా, ఉల్లి రైతులకు నష్టపరిహారం అందించాలని ఈ సమస్యలపైన ఈ నెల 7వ తేదీ మంగళవారం కోసిగి వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, గోపాల్, మారెప్ప, వీరేష్, నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యం'



కార్మికులతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కుల పరిరక్షణ పోరాటాలతోనే సాధ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. ఆదివారం పాత మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ యూనియన్ ఉపాధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల విస్తృత సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక రంగం స్వాతంత్ర్యం కంటే ముందు బ్రిటీష్ వారితో పోట్లాడి సాధించుకున్న 44 చట్టాలను బీజేపీ ప్రభుత్వం 2020లో కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ చట్టాలుగా చేసి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. రాష్ట్రంలో బానిసలుగా మార్చే పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కుటుంబాల్లో చనిపోయిన ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పిఆర్సి 50శాతం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అలాగే 62 సంవత్సరాలు కొనసాగించాలని తదితర సమస్యలపై మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రాముడు, కేసన్న, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు మహోత్సవాలు


వగరూరులో దస్తగిరయ్యను దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో దస్తగిరి స్వాముల ఉరుసు మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాజారెడ్డిలు దర్శించుకుని మొక్కులు తీర్చుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దస్తగిరయ్య స్వామికి పట్టువస్త్రాలు, పుష్పాలు అలంకరణ చేసి ఊరేగించారు. ఉరుసు మహోత్సవాలు వైభవంగా ముగియడంతో గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. కల్లుదేవకుంట సింగిల్ విండో అధ్యక్షురాలు రాగమ్మ, పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, లింగప్ప, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి ఫారం సమీపంలో జరిగిన రోడ్డు ప్ర మాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, రూ రల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు ఎమ్మిగనూరు మండలం నక్కలమిట్ట గ్రామానికి చెందిన వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న లక్ష్మన్న పని నిమిత్తం ఎమ్మిగనూరుకు వచ్చారు. పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా రాగిమాన్‌దొడ్డి క్రాస్‌రోడ్డు సమీపానికి వెళ్లగానే గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లిందన్నారు. దీంతో లక్ష్మన్న తలకు, కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం లక్ష్మన్న ను ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

పెద్దకడబూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి దాదాపు 70మందికి పైగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రచా రక్ శేషు పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా పంచ్ పరివర్తన విధి విధానాలను ఆయన వివరించారు. ఇందులో కుటుంబ సౌ భ్రాతత్వం, పర్యావరణ పరి రక్షణ, స్వదేశీ ఉత్పత్తుల విని యోగం, పౌర విధులు, చట్టాల పాటింపు, సామాజిక సమరసత అనే విషయాలను క్లుప్తంగా వివరించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

పెద్దకడబూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, యువ నాయకులు ప్రదీప్‌రెడ్డిలు అన్నారు. కల్లుకుంట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం చిన్న తుంబళం చెరువును పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపో యిన రైతులను ఆదుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకున్న సీఎం : టీడీపీ


క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

పెద్దకడబూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదుకోవడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవర మాకాంతరెడ్డి, సొసైటి చైర్మన్ మీసేవా ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆటో డ్రైవర్లతో కలిసి చిన్నతుంబళంలో టీడీపీ సీనియర్ నాయకుడు సిద్దప్పదని, గ్రామాధ్యక్షుడు వీరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు క్షరాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు శివ, చిన్న నారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.